క్లుప్తంగా

జీతాలు ఇప్పించాలంటూ వేడుకోలు


ఆవేదన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పుల్లలచెరువు: తమకు జీతాలు ఇప్పించాలంటూ స్థానిక గ్రామ పంచాయతీ కార్మికులు వేడుకుంటున్నారు. ఈ మేరకు వారు శనివారం మాట్లాడుతూ తమను పనులకు మాత్రమే వాడుకుంటున్నారని, కనీసం తాము ఎలా జీవనం సాగించాలో సర్పంచ్, కార్యదర్శి లోచన చేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు ఇవ్వండని అధికారుల చుట్టూ తిరిగి కాళ్లు అరుగుతున్నాయని, తమ లాంటి చిరుద్యోగులు జీతాలు లేకుంటే ఎలా జీవనం సాగిస్తారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి జీతాలు వచ్చే ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

వికసిత్ భారత్ కోసం మోదీ కృషి


జిల్లా నేతలతో మండల కమిటీ సభ్యులు

త్రిపురాంతకం: వికసిత్ భారత్ కోసం ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆ పార్టీ మండల సమావేశం శనివారం జరిగింది. జాతీయ స్థాయిలో బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. అనంతరం ఆయన మండల కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షురాలిగా మునికుమారిని ప్రకటించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు కె.పిచ్చయ్య, మల్లికార్జున్, నాసరరెడ్డి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు నాగేశ్వరావు, నర్సయ్య, వీరాంజనేయులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు

- 18 మద్యం సీసాలు స్వాధీనం


మద్యం సీసాలతో ఎక్సైజ్ అధికారులు

దొనకొండ: మద్యం అక్రమ అమ్మకాలు నిరోధించడంలో భాగంగా దర్శి ఎక్సైజ్ సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని గ్రామాల్లో బెల్టుషాపులపై శనివారం దాడులు చేశారు. ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దొనకొండకు దగ్గరలో చలమయ్య అనే వ్యక్తి 18 మద్యం సీసాలు బెల్టుషాపు నిర్వహణ కోసం ఉంచడంతో అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ వీఆర్ సత్యనారాయణ, సిబ్బంది ఎస్.శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

చినుకు కోసం చింత


బీడుగా మారిన పొలాలు


చుక్క నీరు లేని కొచ్చెర్లకోట చెరువు

దొనకొండ: ఖరీఫ్ సీజన్ ఆరంభమై నెల రోజులు కావస్తోంది. అయినా వర్షం కురవక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రుతుపవనాలు వస్తున్నాయి. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పడంతో రైతులు ఎంతో సంబరపడ్డారు. వరుణ దేవుడు మాత్రం రైతులపై కరుణ చూపలేదు. మబ్బులు కాస్తున్నాయి.. చినుకు జాడ కానరావడం లేదు. కాలం గడుస్తున్నా పదునైన వర్షం పడక పొలం దుక్కి దున్నక భూములు బీడుగా మారుతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు సబ్సిడీపై విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, తీసుకెళ్లండంటూ ప్రచారం చేస్తున్నారు. కొనుగోలు చేసేందుకు రైతులకు ఇష్టం లేక వర్షం పడితే విత్తనాలు కొంటామని చెప్తున్నారు. మండలంలోని 18 పంచాయతీల్లో 80 శాతం రైతులు వర్షంపైనే ఆధారపడి కంది, ఆముదాలు, పత్తి, జొన్న మెట్ట భూముల్లో సాగు చేస్తున్నారు. ఆయకట్టు రైతులు వరి నారు పోసుకుందామనుకుంటే చెరువుల్లో చుక్క నీరు లేక చిల్లచెట్లతో అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. గేదెలు తాగేందుకు నీరు లేక మేసేందుకు గడ్డి లేక పోవడంతో పొలాల్లో మేత కోసం, నీటి కోసం తిరుగుతూ ఇళ్లకు వస్తున్నాయి. గ్రామాల్లోని రైతులు వ్యవసాయం చేయలన్నా ముందుకు రాలేని పరిస్థితి ఎదురైంది. పండించిన పంటకు గిట్టుబాటు లేక కొనేనాథుడు కరువయ్యాడు. కొంతమంది రైతులు అప్పుల్లో కూరుకపోయారు. మరికొంతమంది వ్యవసాయం మానుకున్నారు. వారికి చేతిలో ఉండే కాడి ఎద్దులను అమ్ముకునే పరిస్థితి ఎదురైంది. ఇది ఇలాగే కొనసాగితే గ్రామాలకు గ్రామాలు పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితి ఎదురవుతుందని, ఎవరిని పలకరించినా ఈ ఏడాది జీవనోపాధి కష్టంగా ఉంటుందని చెబుతున్నారు.

జీవనోపాధి కష్టంగా ఉంది



గతేడాది పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించలేదు. కుటుంబం మొత్తం కష్టపడి పంటలు పండించాం. తీరా అమ్ముకుందామనుకునే సరికి మిర్చికి రూ.10 వేలు, కందులుకు రూ.6 వేలు మాత్రమే ధర పలికింది. మళ్లీ ఈ ఏడాది కాడి పట్టుకుని వ్యవసాయం చేయాలంటే కాళ్లు ముందుకు రాలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు పడలేదు. పొలం బీడుగా మారిపోయింది. రోజూ ఆకాశం వైపు చూడాల్సి వస్తోంది.

– చెన్నుబోయిన గురుమూర్తి, రైతు, రుద్రసముద్రం

ఈ ఏడాది లక్ష నష్టం వచ్చింది



మూడు ఎకరాల్లో మిర్చి సాగు చేశా. దిగుబడి బాగా వచ్చింది. రేటు మాత్రం సన్నగిల్లింది. కూలి రేట్లు ఆకాశాన్ని అంటాయి. క్రిమిసంహారక మందుల షాపుల్లో అప్పులు తీర్చలేకపోతున్నాం. ఈ ఏడాది పొలాలు దున్నలేదు. అలాగే వదిలి పెట్టాం.

– టమటం పాపిరెడ్డి, రైతు, ఇండ్లచెరువు

పేరుకున్న మురుగు


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

తాళ్లూరు: మండలంలోని వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న పంచాయతీల్లో తూర్పు గంగవరం మొదటి వరసలో ఉంటుంది. ప్రధాన వీధుల్లో మురుగు ఎక్కడికక్కడ పేరుకుపోయి కాలువల నుంచి రోడ్లపై పారుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. మురుగుపై దోమలు చేరి విజృంభిస్తున్నాయని, ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నా అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి మురుగు సమస్యను తొలగించాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

సైడు కాలువలు నిర్మించలేదు



ఇటీవల కాలంలోనే ఎంపీ నిధులతో సైడ్ కాలువలు నిర్మించారు. సరైన ప్రమాణాలతో సైడు కాలువలు నిర్మించక పోవడంతో మురుగు రోడ్ల మీదకు చేరి ఇళ్ల ముందుకు వస్తోంది. అధికారులు వెంటనే స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలి.

– రామకోటయ్య, తూర్పు గంగవరం

పాలేగార్ వారసత్వ హక్కులు గుర్తించాలి


పాలేగార్ల ఫొటోలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పుల్లలచెరువు: రాష్ట్రంలో గతంలో ఉన్న పాలేగార్ వారసత్వ హకులను ప్రభుత్వం గుర్తించాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకి రఘు కోరారు. శనివారం అన్నమయ్య జిల్లా సుండుపల్లిలో రాష్ట్ర పాలేగార్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పాలేగార్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు పెనుగొండ కేశవులునాయుడు మాట్లాడుతూ కాకతీయ రాజుల కాలంలో పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా పాలేగార్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని, దీంతో వారు అనేక ప్రజా ఉపయోగ కార్యక్రమాలను గ్రామాల్లో చేపట్టారని గుర్తు చేశారు. ఈస్ట్ ఇండియా కంపెనీ వారు పాలెగార్ల ఆధీనంలో ఉన్న గ్రామాలను స్వాధీనం చేసుకుని పెన్షన్ ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో చాలా మందికి పాలేగార్ల వారుసులకు పెన్షన్ ఆపేశారన్నారు. పాలేగార్ల వారుసులకు ఇచ్చే పెన్షన్ పునరుద్ధరణ కోసం చేస్తున్న నిబంధనలు సరళీకరించి, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. పాలేగార్ల చరిత్రను విద్యార్థుల పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. పాలేగార్లు ఏర్పాటు చేసిన చెర్వులకు, కట్టడాలకు వారి పేర్లు పెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం దృష్టికి, అధికారులు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యదర్శి రఘు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అనంతరం ప్రముఖ చరిత్ర పరిశోధకుడు ఓబుల్‌రెడ్డి తీసిన ఫొటోలు, పుస్తకాలు ఆవిష్కరించారు. పాలేగార్లు చంద్రప్పనాయుడు, ప్రతాపనాయుడు, రాజగోపాలనాయుడు, రెడ్డప్ప, వెంకటరవణ పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

దర్శి: సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో వచ్చే నెల 20వ తేదీ నుంచి 25 వరకు జరుగుతాయని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్. కరుణానిధి తెలిపారు. మహాసభల కరపత్రాలను స్థానిక గుజ్జుల సరళాదేవి భవన్‌లో ఆ పార్టీ నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరుణానిధి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల వేడుకల్లో భాగంగా మొట్టమొదటి సారిగా ప్రకాశం జిల్లా రాష్ట్ర మహాసభలకు వేదిక అవుతుందన్నారు. మహాసభలకు వెయ్యి మంది కళాకారులు, 100 కళారూపాలు, 100 డప్పులతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహాసభలకు 26 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని, రాష్ట్ర, జాతీయ నాయకులు పాల్గొంటారని వివరించారు. 23వ తేదీన శ్రమజీవుల శంఖారావం ప్రజాప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర మహాసభల విజయవంతానికి జిల్లా ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.రామాంజి యాదవ్, సీపీఐ సీనియర్ నాయకులు కల్లూరి పెద్ద ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ నాయకులు సింగరకొండ శ్రీను, విజయ్, హమాలి వర్కర్స్ నాయకులు వి.శ్రీను, బిజ్జాల శ్రీను, జక్క నాగేశ్వరరావు, భిక్షాలు, ఎస్ఎస్‌పీ యూనియన్ నాయకులు ఊరు బిండి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫైనాన్స్ బిల్‌ను రద్దు చేయాలి

పొదిలి: కొత్త పెన్షన్లు, పాత పెన్షన్ల మధ్య వ్యత్యాసం ఏర్పడి పాత పెన్షనర్లు నష్టపోయే ఫైనాన్స్ బిల్ 2025ను వెంటనే రద్దు చేయాలని పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఏ.బాదుల్లా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొదిలి తాలూకా పెన్షనర్ల సంఘ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక పెన్షనర్ల భవనంలో జరిగింది. ప్రధాన కార్యదర్శి షేక్ మదార్‌వలి, యల్లమందారెడ్డి మాట్లాడుతూ 15వ తేదీన ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఫైనాన్స్ బిల్ 2025ను రద్దు చేయాలని, కేంద్రంలో 8వ పే కమిషన్, రాష్ట్రంలో 12వ పే కమిషన్ వెంటనే నియమించాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

చైర్మన్ పదవి కేటాయించడం అభినందనీయం


నారాయణమ్మను సత్కరిస్తున్న సెగ్గెం శ్రీనివాసులు

దర్శి: స్థానిక మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని బీజేపీకి కేటాయించడం అభినందనీయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసులు అన్నారు. మాడపాకుల నారాయణమ్మ నివాసంలో శనివారం విలేకరులు సమావేశం ఏర్పాటు చేసి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఎన్నికైన ఆమెను ఘనంగా సత్కరించారు. సెగ్గెం శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమిలో ఉన్న బీజేపీ కోటాలో తమకు ఈ పదవి దర్శిలో కేటాయిండంలో సహకరించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. నారాయణమ్మ మాట్లాడుతూ తమపై నమ్మకంతో పదవి కేటాయించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మాడపాకుల శ్రీను, జిల్లా ప్రధానకార్యదర్శి కూకట్ల నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకునికి బూచేపల్లి నివాళి

చీమకుర్తి రూరల్: మండలంలోని పిడతలపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం మండల అధ్యక్షుడు మేకల వీరారెడ్డి తండ్రి, పార్టీ సీనియర్ నాయకుడు గోవిందరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి, కత్తి రమణారెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, నల్లూరి చంద్రారావు, శేషారెడ్డి, సుంకర శ్రీను తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

18న చలో ఢిల్లీ


కరపత్రాలు విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

దర్శి: కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ డీఐఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య తెలిపారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో చలో ఢిల్లీ పోస్టర్లు ఆవిష్కరించారు. కేవీ పిచ్చయ్య మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు అనేక హామీలు ఇచ్చారని, నేటికీ అవి అమలుకు నోచుకోలేదన్నారు. ముఖ్యంగా విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పారుగానీ ఇప్పుడు అది ముగిసిన అధ్యయమని అంటున్నారని పేర్కొన్నారు. తిరుపతిలో జరిగిన సభలో తిరుమల వెంకన్న సాక్షిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐదు సంవత్సరాల హోదా ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. హోదా ఇవ్వకపోవడానికి కేంద్రానికి ఉన్న అడ్డంకులు ఏమిటని ప్రశ్నించారు. దొనకొండలో పారిశ్రామిక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, పరిశ్రమలు వస్తే వలసలు, కరువు తీరుతుందని చెప్పారు. 32 మంది బలిదానంతో ఏర్పరుచుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ దిశగా కేంద్రం అడుగులు వేస్తోందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కేంద్రం భాగస్వామ్యంలో కీలక భూమిక పోషిస్తున్న తరుణంలో ఇదే సరైన సమయమని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విభజన హామీలు అమలుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఏపీ అంటే అమరావతి, పోలవరమే కాదని, విభజన హామీలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. 18న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే మహాధర్నాలో యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఆర్‌జేసీ పాల్, మండల నాయకులు షేక్ పీరా సాహెబ్, కళ్యాణ్, షేక్ సుభానీ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తల్లో జోష్


వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న అన్నా, బూచేపల్లి, జంకె, బత్తుల


ఎమ్మెల్యే బూచేపల్లిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

- హోరెత్తిన జై జగన్ నినాదాలు

మార్కాపురం టౌన్/తర్లుపాడు: మార్కాపురం నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ కార్యకర్తల విస్తృత సమావేశం శనివారం పట్టణంలోని బి కన్వెన్షన్ హాల్లో జరిగింది. సమావేశం పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపింది. ముఖ్యనాయకులు మాత్రమే హాజరవుతారని భావించగా నియోజకవర్గంలోని పట్టణ, రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల నుంచి సమావేశానికి కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావడంతో కన్వెన్షన్ హాలు పూర్తిగా నిండిపోయి బయట వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాయకులు ప్రసంగిస్తున్నంత సేపు, బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీపై ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని మాట్లాడుతున్న సమయంలో కార్యకర్తలు జై జగన్.. అంటూ నినాదాలు చేసి హోరెత్తించారు. కూటమి ప్రభుత్వంలో పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు అధ్యక్షతన జరగగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జంకె వెంకటరెడ్డి, బత్తుల బ్రహ్మానందరెడ్డితో పాటు స్థానిక నాయకులు కూడా పాల్గొని మాట్లాడుతున్నంత సేపూ కార్యకర్తలు ఉత్సాహంగా మద్దతు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, కో ఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి, షంషేర్ ఆలీబేగ్‌లు కార్యకర్తలతో జై జగన్ నినాదాలు ఇప్పించారు. పలువురు దివ్యాంగులు కూడా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి సమావేశానికి హాజరయ్యారు. సమావేశం చివరి వరకు కార్యకర్తలెవరూ బయటకు వెళ్లలేదు. సమావేశంలో డి.గోపాల్‌రెడ్డి, బాలిరెడ్డి, కౌన్సిలర్లు అమీరుల్లా ఖాన్, పీవీ నాయుడు, బొగ్గరపు శేషయ్య, రోజ్ లిడియా, ఆసీఫ్‌ఖాన్, జి.సత్యనారాయణరెడ్డి, నల్లబోతుల కొండయ్య, మహేశ్వరరెడ్డి, సంజీవరెడ్డి, ఖాదర్‌బాషా, గౌస్ మొహిద్దీన్, ఎస్.బాలచంద్రుడు, ఎల్.శేఖర్, కె.సురేష్, రఘుపతి శివ, బూదాల గురవయ్య, సోషల్ మీడియా రఫీ, గుంటక చెన్నారెడ్డి, ఆదిమూలపు లూకా, జంకె కృష్ణారెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి అన్నా రాంబాబు


హాజరైన నాయకులు, కార్యకర్తలు

మంచినీటి సమస్యతో అవస్థలు


బోరు నుంచి బయటకు తీసిన విద్యుత్ మోటార్


మోటార్ సైకిల్‌పై నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

- జేసీ అగ్రహారంలో మరమ్మతులకు గురైన విద్యుత్ మోటార్

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో సింగిల్ ఫేజ్ విద్యుత్ మోటార్ మరమ్మతులకు గురైంది. జగనన్నకాలనీ వెళ్లే రోడ్డులోని విద్యుత్ మోటార్ 20 రోజులుగా పనిచేయడం లేదు. పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కరించలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు లోపలి నుంచి విద్యుత్ మోటార్ బయటకు తీసి మరమ్మతులు చేయిస్తున్నామంటూ కాలయాపన చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోకి వెళ్లి గృహ అవసరాలకు, పశువులకు సరిపడా నీటిని తెచ్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

12 గంటలైనా..తెరుచుకోని పశువైద్యశాల


12 గంటలైన తెరుచుకోని చోళ్లవీడు గ్రామీణ పశువైద్యశాల

రాచర్ల: మండలంలోని చోళ్లవీడు గ్రామంలోని గ్రామీణ పశువైద్యశాల శనివారం మధ్యాహ్నం 12 గంటలవుతున్నా తెరుచుకోలేదు. గతంలో ఇక్కడ లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఏ.శివచరణ్ గౌడ్ అనుములపల్లె గ్రామానికి బదిలీ కాగా ఆయన స్థానంలో సుప్రియ బాధ్యతలు స్వీకరించారు. బదిలీలు జరిగి దాదాపు నెలవుతున్నా చోళ్లవీడు గ్రామీణ పశువైద్యశాల సక్రమంగా తెరవడం లేదని పశుపోషకులు ఆరోపించారు. శనివారం రైతులు, గొర్రెల కాపరులు పశువైద్యశాలకు వచ్చి వేచి ఉన్నా ఎవరూ ఎంతసేపటికీ రాకపోవడంతో వెనుతిరిగారు. అంతేకాక అనుములపల్లె గ్రామీణ పశువైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఏ.శివచరణ్ గౌడ్ మధ్యాహ్నం 12:13 గంటలకే తాళాలు వేసి వెళ్లిపోయారు. మళ్లీ సాయంత్రం విధులకు రావాల్సి ఉండగా డుమ్మాకొడుతున్నారని రైతులు ఆరోపించారు. ఈ రెండు గ్రామాల్లో సకాలంలో పశువులకు, గొర్రెలకు, మేకలకు వైద్య సేవలు అందడంలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని చోళ్లవీడు, అనుములపల్లె గ్రామాల్లోని గ్రామీణ పశువైద్యశాలల్లో పనిచేసే లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌లు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల పశుపోషకులు కోరుతున్నారు.